క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఆదివారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో విమానాశ్రయానికి వచ్చి ఆయనకు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రమణమూర్తికి సత్కారం

మల్కాపురం: షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రతినిధి, షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ నాయకుడు మాడిసి రమణమూర్తి యాదవ్ ఈ నెలాఖరుకు పదవీవిరమణ చేయనున్నారు. దీనిలో భాగంగా షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ రమణమూర్తిని సత్కరించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని రమణమూర్తి దంపతులను సత్కరించారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పినగాడిలో నేడు భూముల రీసర్వే

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే సోమవారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 199, 58, 57, 210, 207లో నిర్వహించనున్నట్టు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సంబంధిత సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సెక్టార్-2లోని యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కొండపల్లి రామారావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటైంది. టి. హనుమంతరావు గౌరవాధ్యక్షుడిగా, కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షుడిగా, కె.అప్పలరాజు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎం. రామస్వామి ప్రధాన కార్యదర్శిగా, గురుప్రసాద్ ఉప ప్రధాన కార్యదర్శిగా, రాందాస్ నరేంద్ర కోశాధికారిగా ఎన్నిక కాగా ఐదుగురు ఉపాధ్యక్షులు, 9 మంది సంయుక్త కార్యదర్శులు, 10 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదే లక్ష్యం

మహారాణిపేట: మిలియన్ వైఆర్‌సీ (యంగ్ రెడ్ క్రాస్) వలంటీర్ల నమోదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, సీఈవో ఎ.కె.ఫరీదా తెలిపారు. ఆదివారం విశాఖ రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృత పరుస్తున్నామన్నారు. విద్యార్థులు, వలంటీర్లను పెద్ద సంఖ్యలో చేర్చుకుని వారి ద్వారా పేదలకు వివిధ రకాల సేవలందించాలని నిర్ణయించామన్నారు. వీరిందరికీ ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశాఖ జిల్లా చైర్మన్ వై.శివనాగేంద్రరెడ్డి, కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతినిధులు రావు, మురళీ పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో బ్యూటిఫికేషన్

- కాకాని నగర్ అంతర్గత రహదారులఅభివృద్ధి
- డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం



హైవే నుంచి విమాన్ నగర్‌కు వెళ్లే రహదారిలో బ్యూటిఫికేషన్ పనులు



కాకాని నగర్‌లో రహదారి నిర్మాణ పనులు

విశాఖ విద్య: పశ్చిమ నియోజవర్గంలోని 90వ వార్డు కాకానినగర్‌లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ అధికారులు ఫోకస్ పెట్టారు. వార్డులో టీడీపీ పార్టీ కార్పొరేటర్ గెలిచినప్పటికీ, ఏమాత్రం పక్షపాతధోరణి లేకుండా జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయిస్తున్నారు. వార్డు పరిధిలోని కాలనీల ప్రజానీకం అవసరాల మేరకు మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎస్‌వీడీ కాకాని నగర్, విమాన్ నగర్ కాలనీలను అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. సరైన డ్రైనేజీలు లేక, వర్షాకాలంలో రహదారుల పైనే మురుగునీరు ప్రవహించేది. ఇలాంటి సమస్యలపై గత పాలకులెవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ నగరాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో, ఇందుకనుగుణంగా జీవీఎంసీ పాలక మండలి సైతం వార్డుల అభివృద్ధికి నిధుల కేటాయిస్తోంది.



కాకాని నగర్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ

సుందరంగా రహదారులు

ఎస్‌వీడీ కూడలిలో విద్య సంస్థలు ఉండటం, వ్యాపార, వాణిజ్య సముదాయాలు అందుబాటులో ఉన్న కారణంగా ఈ ప్రాంతం విస్తరణ జరుగుతుంటంతో పరిసర కాలనీల్లో స్థిరపడేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అపార్టుమెంట్లు నిర్మాణం సైతం ప్రస్తుతం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో విమాన్ నగర్, కాకాని నగర్ ఏరియాల్లో రహదారుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రహదారుల నిర్మాణంతో పాటు, వాటిని సుందరంగా తీర్చిదిద్దేలా పనులు చేపడుతున్నారు. హైవే నుంచి విమాన్ నగర్‌కు వెళ్లే 80 అడుగుల రహదారి బ్యూటిఫికేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రహదారి మధ్యలోని డివైడర్లపై అందమైన పూలమొక్కలు నాటారు. దీంతో ఆ దారిలో ప్రయాణం ఆహ్లాదకరంగా సాగనుంది.

ప్రాధాన్యతా క్రమంలో పనులు



జోన్ పరిధిలోని వార్డులన్నింటిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రజావసరాల గుర్తించి ఆ మేరకు నిధులు కేటాయిస్తున్నాం. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయటంతో పాటు, నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– ఎం.మల్లయ్య నాయుడు, జోన్-8 కమిషనర్, జీవీఎంసీ

గతం కంటే మెరుగైన అభివృద్ధి



జీవీఎంసీ 90వ వార్డులోని అన్ని కాలనీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవతో జీవీఎంసీ ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నారు. గతంలో కంటే అభివృద్ధి పనులు ఇప్పుడే ఎక్కువగా జరుగుతున్నాయి.

– నమ్మి శ్రీను, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గోపాలపట్నం: విశాఖలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ సహకరించాలని, స్వచ్ఛందంగా ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని విరమించుకోవాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ హిత చేతి సంచులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చాలా మేరకు ప్లాస్టిక్ సంచుల వాడకం మానేశారన్నారు. స్థానికంగా ఓ కేటరింగ్ సంస్థ సౌజన్యంతో ఇచ్చిన సంచులను వినియోగదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని శ్రీనివాసరావు, ధవళ మోహన్, భూషణం మాస్టార్, రైతు బజారు ఈఓ నారాయణరావు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రైతుబజారులో చేతి సంచులు పంపిణీ చేస్తున్న బెహరా భాస్కరరావు

కారు బోల్తా.. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఉదయం కారు బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసుల వివరాలివి.. కూర్మన్నపాలెం సైమన్ నగర్‌కు చెందిన యువకుడు తెల్లవారి దేశపాత్రుని పాలెం వైపు నుంచి కూర్మన్నపాలెం వైపు కారులో వస్తున్నాడు. సెక్టార్-10 కూడలి వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి బోల్తా కొట్టి సమీప తుప్పల్లోకి దూసుకుపోయింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం కలుగలేదు. ఈ సంఘటనలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లి పోయాడు. సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైవిధ్యం.. విశిష్టం.!

నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా తమ అవసరాలకు అనుగుణంగా నీటి వసతులను సమకూర్చుకుంటోంది. మరో వైపు పర్యావరణాన్ని, ప్రకృతిని సంరక్షిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ దిశగా నవ్య ప్రాజెక్టులను రూపకల్పనచేసి చూపుతోంది. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా పలు వైవిధ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తన విశిష్టతను చాటుకుంటోంది. ఇటీవల కాలంలో ఏయూ చేపట్టిన నాలుగు అంశాలు ఎంతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. –ఏయూ క్యాంపస్

- వినూత్న ప్రాజెక్టులకు ఏయూ శ్రీకారం
- నీటి సంరక్షణకు ప్రత్యేకంగా చెరువు నిర్మాణం
- ఇంకుడు గుంతలు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం ఏర్పాటు
- ప్రత్యేక వాహనంతో కాలుష్య అధ్యయనం



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన చెరువు

నీటి సంరక్షణకు చెరువు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తూ కొత్త చెరువును ప్రత్యేకంగా తవ్వించారు. నూతనంగా నిర్మించిన అల్గారిదం భవనానికి ఆనుకుని దీనిని అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ రాతితో గట్టును సైతం నిర్మించారు. గట్టుపై విద్యార్థులు కూర్చుని సేదతీరడానికి ఉపయుక్తంగా సిమెంట్ బెంచీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు ప్రారంభించారు. వర్షా కాలంలో భవనాలపై పడే నీరు, ఇతర మార్గాల్లో వచ్చే నీటిని దీనిలోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసే సమయంలో దీనిలో పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ఈ చెరువును నిర్మించారు. సమీప ప్రాంతాల వారికి నీటి కొరత రాకుండా, భూగర్భ జలాలు పెరిగేలా ఈ చెరువు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

వర్సిటీలో ఉన్న చెట్ల నుంచి నిత్యం రాలే ఆకులను ఎరువుగా మార్చడానికి ప్రత్యేకంగా సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏయూ శానిటేషన్ డీన్ కార్యాలయం చేరువలో దీనిని నిర్మించారు. నిత్యం వర్సిటీ పరిసరాల్లో రాలే ఆకులు, ఎండిన చెట్ల వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంపోస్ట్ తయారీ పిట్‌లలో వేసి ఎరువుగా మార్చుతారు. ఈ సేంద్రియ ఎరువును ఏయూలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలు పెంపకానికి వినియోగించనున్నారు.

కాలుష్య అధ్యయన వాహనం



పొల్యూషన్ మానిటరింగ్ వాహనం

ఆంధ్ర విశ్వవిద్యాలయం మీటిరాలజీ, ఓషనోగ్రఫీ విభాగానికి నూతనంగా డీఎస్‌టీ నిధులతో మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మోనిటరింగ్ ఫెసిలిటీని అందుబాటులోకి వచ్చింది. డీఎస్‌టీ ఫిస్ట్ పథకంలో భాగంగా రూ.50 లక్షలతో దీనిని సమకూర్చారు. నగరంలోని విభిన్న ప్రాంతాలలో వాయు కాలుష్యాన్ని గణించడానికి అవసరమైన ఉపకరణాలు ఈ వాహనంలో ఉన్నాయి. విభాగ విద్యార్థులు, పరిశోధకులు విశాఖ నగరంలోని నిర్దిష్ట ప్రాంతాలకు ఈ మొబైల్ వాహనాన్ని తీసుకువెళ్లి వాయు కాలుష్యాన్ని గుర్తించడానికి, సేకరించిన సమాచారం ఆధారంగా విశ్లేషించడం, ఖచ్చితమైన ఫలితాలను అందించడం చేస్తారు.

భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు

వర్సిటీలో ఉన్న భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు తవ్వారు. భవనాలపై నుంచి పడే వర్షపు నీటిని ఈ గుంతల్లోకి మళ్లించి భూగర్భ జలాలను పెంచే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. వర్సిటీ పరిసరాలలో పుష్కలంగా భూగర్భ జలాలు ఉండేలా ఈ గుంతలు దోహదపడనున్నాయి. ఫలితంగా వర్సిటీ చుట్టూ ఉన్న ఐదారు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రాంతాలకు సైతం నీటి కొరత రాకుండా, భూగర్భ జలాల శాతం పెరగడానికి ఉపయుక్తంగా నిలవనున్నాయి.



ఇంకుడు గుంత

మంచి చిత్రాలను ఆదరించాలి

సీతంపేట: ఇటీవల విడుదలైన మార్టిన్ లూథర్ కింగ్ సినిమాపై సమీక్ష, చిత్రంలో నటించిన విశాఖ కళాకారులకు సత్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హాస్యప్రియ కామిడీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే, సమాజంలో అసమానతలను ఎత్తిచూపుతూ ఆలోచింపజేసే చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ అని పేర్కొన్నారు. ఇటువంటి మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కె.సి.హెచ్.గోపినాయుడు, ఎస్.కె.మదీన(మల్లిక)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



విశాఖ కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ట్రాక్‌పై మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని లంకెపాలెం వద్ద కదులుతున్న రైలు నుంచి జారి పడిన వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పది గంటల సమయంలో లంకెలపాలెం సమీపంలో కదులుతున్న రైలు నుంచి జారిపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు, నీలిరంగు టీషర్ట్, నలుపురంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నట్టు వారు తెలిపారు. వివరాల కోసం దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ఔట్‌పోస్ట్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు కరాటే పోటీలు



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: ఎస్‌వీడీ కూడలి 90వ వార్డు విమాన్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విద్యార్థులకు కరాటే పోటీలను నిర్వహించారు. ద రైట్ వే కరాటే చాంపియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పరిసర కాలనీలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కరాటేలో ప్రావీణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు నాల్గవ కరాటే బెల్ట్ గ్రేడ్ అవార్డు ప్రదానం చేసేందుకు పోటీలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జీవీసీహెచ్ నర్సింహమూర్తి తెలిపారు. కరాటే పోటీల్లో తదుపరి బెల్ట్ సాధించేందుకు ఎంపికైన విద్యార్థులకు విమాన్ నగర్ రెసిడెన్షియల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ సురేష్ కుమార్, పి.నాగు చేతుల మీదగా బెల్ట్, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, ఆసక్తి ఉన్న వాటిలో రాణించాలన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. విద్యార్థులను కరాటేలో ప్రోత్సహిస్తున్న నిర్వాహకులకు అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కరాటే ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.

అల్యూమినియం ప్లేట్ల చోరీకి యత్నం

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

మల్కాపురం: మద్యానికి బానిసైన ఇద్దరు వ్యక్తులు గృహ నిర్మాణంలో వాడే అల్యూమినియం ప్లేట్ ముక్కలను దొంగలిస్తూ స్థానికులకు చిక్కారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. 62వ వార్డు అచ్చినాయుడు తోట కొండ ప్రాంతంలో కొంత కాలంగా టిడ్కో గృహాలు నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో శ్లాబ్ సెంటరింగ్ తదితర పనులకు అల్యూమినియం ప్లేట్లను వినియోగిస్తున్నారు. పని పూర్తయిన తర్వాత వాటిని కాంట్రాక్టర్ టిడ్కో ఇళ్ల పరిసరాల్లోని తుప్పల వద్ద ఉంచారు. శ్రీహరిపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఉదయం టిడ్కో గృహాల నిర్మాణాల వద్దకు వచ్చి తుప్పల్లో ఉన్న సుమారు పది కేజీల బరువు గల అల్యూమినియం ప్లేట్లను దొంగలిస్తున్న సమయంలో అక్కడున్న స్థానికులు గమనించి ఇద్దరినీ పట్టుకుని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో మల్కాపురం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, దొంగలించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం అల్యూమినియం సామగ్రిని దొంగిలించేందుకు ప్రయత్నించి ఇలా పట్టుబడ్డారని క్రైం పోలీసులు తెలిపారు. వీరిని విచారించి, పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పరిధి లక్ష్మీ నగర్, రామకృష్ణానగర్ ప్రాంతాల ఆర్‌సీలకు పొదుపు సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో ఆదివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దసరా, దీపావళి సందర్భంగా మహిళలకు చీరలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివారావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, ఊటపల్లి గోవిందు, వీర్రాజు, సీవో ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు అందజేస్తున్న బెహరా భాస్కరరావు

విద్యా సమాచారమ్

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీలో జరుగుతున్న పనుల ప్రగతిపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం సమీక్షించారు. వివిధ విభాగాల అధికారులతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో జరగాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాక్ కమిటీ పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు చేపడుతున్న అధికారులు ఆదివారం సైతం పూర్తి స్థాయిలో పని చేశారు. అన్ని విభాగాలను భాగస్వామ్యం చేస్తూ సమన్వయంతో పని చేయాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమాసుధ, ఆచార్య ఎ.కె.ఎం.పవన్, ఆచార్య విజయమోహన్, ఎస్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, కె.సీతామాణిక్యం, సాల్మన్ బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఉద్యమంలా స్వచ్ఛ భారత్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోంది. ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, విద్యార్థులు, సిబ్బంది భాగస్వాములు అవుతూ నిత్యం వర్సిటీలో ఒక ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలలో ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్, రంజని గెస్ట్‌హౌస్ ప్రాంగణాలలో శ్రమదానం చేశారు. సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్, వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దే దిశగా పని చేస్తామని షారోన్‌రాజు తెలిపారు.



ఉద్యోగులతో కలసి వ్యర్థాలను తొలగిస్తున్న డాక్టర్ షారోన్ రాజు

990వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 990వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులను పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోమని, పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



990వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు